ఇదేం బాదుడు బాబూ..

విద్యుత్ చార్జీల పెంపుపై వెల్లువెత్తిన నిరసన

- సంక్షేమ పథకాలకు తూట్లు
- సంపద సృష్టిస్తామని చెప్పి పన్నులు పెంపు
- కూటమి అరాచక పాలనపై మిన్నంటిన ఆగ్రహ జ్వాలలు
- వెంటనే పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్

పెనమలూరు: ఎన్నికల ప్రచారంలో సంపద సృష్టి స్తానని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులను దగా చేశాడని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి విమర్శించారు. కరెంట్ చార్జీల బాదుడుపై శుక్రవారం వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో గంగూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆ పార్టీ శ్రేణులు నిరసన గళం విప్పారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేవభక్తుని చక్రవర్తి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊరూరా తిరిగి విద్యుత్ చార్జీలు పెంచనని మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించి అధికారం చేపట్టాడని ఆరోపించారు. చంద్రబాబు అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రూ. 15,500 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపాడని ధ్వజమెత్తారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీల వద్ద విద్యుత్ బిల్లులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ దుర్మార్గపు పాలనను వైఎస్సార్ సీపీ సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలుస్తుందని చెప్పారు. విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరుబాట తప్పదని పేర్కొన్నారు.

సంపద సృష్టి అంటే పన్నులు పెంచడమా.?

విద్యుత్ చార్జీలను చంద్రబాబు ఎందుకు పెంచాడో ప్రజలకు సమాధానం చెప్పాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి(చిట్టిబాబు) డిమాండ్ చేశారు. చంద్రబాబు ఒక శాతం జీఎస్టీ పేరుతో సెస్సు వేసి పన్నులు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి లెటర్ ఇచ్చాడని ఆరోపించారు. సంపద సృష్టిస్తానని చెప్పి అప్పులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని, ప్రజలను నిలువునా ముంచేశాడని విమర్శించారు. కూటమి ప్రభుత్వం త్వరలోనే పింఛన్లు తొలగించే పని చేస్తోందని, సంక్షేమ పథకాలను అటకెక్కిస్తోందని ఆరోపించారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏఈ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ జి. ప్రణీత్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, పార్టీ నేతలు పి.రాఘవరావు, పిడికటి రామకోటేశ్వరరావు, చక్కా గోపి, అబూకలాం, సోలే సురేష్, దాసే రవి, జంపార కొండలరావు, సర్పంచి బాలస్వామి, జి.మదన్, మాదు శ్రీహరిరాణి, రామినేని రమాదేవి, బిందుమాధవి, చిట్టూరి ప్రసాద్, చిరంజీవి, చాంద్‌బాషా, లతీఫ్, బాలకృష్ణ, మరీదు శ్రీనివాసరావు, హక్, మండూరు కోటేశ్వరరావు, గని, రహీం, పోలవరపు రవి, మరీదు విజయ్‌కుమార్, కోటిరెడ్డి, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గంగూరులో నిరసన తెలుపుతున్న చక్రవర్తి, చిట్టిబాబు, ప్రణీత్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేతలు

విద్యుత్ చార్జీల భారాన్ని వెంటనే ఎత్తివేయాలి

గన్నవరం: ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై మోపిన విద్యుత్ భారాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని వైఎస్సార్ సీపీ నేతలు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జీలకు వ్యతిరేకంగా శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరుబాట నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, వైఎస్సార్ సీపీ బాపులపాడు మండల అధ్యక్ష, కన్వీనర్లు నక్కా గాంధీ, అవిర్నేని శేషగిరిరావు, పలువురు నేతలు విద్యుత్‌శాఖ ఏఈ వెంకటరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దగా చేస్తోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు.

ప్రజలపై మోయలేని భారం

అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఇష్టారాజ్యంగా చార్జీలు పెంచుతూ ప్రజలపై మోయలేని భారం వేస్తున్నారని విమర్శించారు. ఇంకా మరిన్ని విద్యుత్ భారాలు వేసేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమతుందని ఆరోపించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే ప్రజల పక్షాన పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తమ్మిశెట్టి రఘుబాబు, కోట వినయ్‌కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దయాల విజయనాయుడు, కొత్తగూడెం ఉపసర్పంచ్ దేవరపల్లి రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు తిరివీధి రవి, ఎస్సీ సెల్ నేతలు నిడమర్తి రామారావు, మంగళపూడి ప్రకాష్, కొమరవల్లి థామస్, బీసీ సెల్ నాయకుడు సామల ఆంజనేయులు, మైనార్టీ సెల్ నాయకుడు పులిమద్ది మస్తాన్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నున్న గ్రామంలో..

నున్న(విజయవాడరూరల్): కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ నున్న గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏడీఈ రామ్మూర్తికి వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, సొసైటీ మాజీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు కొరప్రోలు కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు అంగజాల హనుమ, దండు సుబ్రహ్మణ్యం రాజు, బొంతు సాంబిరెడ్డి, షేక్ హుస్సేన్, రమేష్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


విద్యుత్‌శాఖ ఏఈ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ పెనమలూరు సమన్వయకర్త చక్రవర్తి, పార్టీ శ్రేణులు


గన్నవరంలో విద్యుత్‌శాఖ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, వైఎస్సార్ సీపీ నేతలు

కదంతొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కంకిపాడు: విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుబాటకు పార్టీ శ్రేణులు కదంతొక్కారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆధ్వర్యంలో గంగూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ఆందోళనకు పెనమలూరు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ప్రజానీకం విద్యుత్ చార్జీల భారాన్ని నిరసిస్తూ ఆందోళనలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఉయ్యూరు సెంటరు నుంచి పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినదించారు. విద్యుత్ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఉయ్యూరు సెంటరు నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు

మాట తప్పిన ప్రభుత్వం


ఎన్నికల్లో కరెంటు చార్జీలు పెంచనని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి రాగానే మాట తప్పారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. రెండు నెలలుగా పేద, మధ్య తరగతి వర్గాలపై విద్యుత్ చార్జీల భారం పడుతోంది. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల కష్టాన్ని దోచుకుంటున్నారు. వెంటనే విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి.

– ఉప్పలూరు సునీల్, తెన్నేరు

మోయలేని భారం


నేను ఎల్ఐసీ అడ్వయిజర్‌ను. వచ్చిన కొంత సొమ్మును ప్రణాళికాబద్ధంగా ఇంటి కోసం వినియోగించుకోవాలి. గతంలో నాకు నెలకు రూ. 650 బిల్లు వచ్చేది. ఈనెల రూ. 1,100 వచ్చింది. రెక్కాడితే కానీ డొక్కాడని పేద వర్గాలకు ఈ బిల్లులు మోయలేని భారం. పేద వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రూఅప్ చార్జీలను వసూళ్లు చేయడం ఆపేయాలి.

– ఎండీ ఇబ్రహీం, ఉయ్యూరు

కూటమి పాలనలో ఇబ్బందులు


చంద్రబాబు నాయుడు విద్యుత్ చార్జీలు పెంచి మోసం చేశాడు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచనని హామీ ఇచ్చి మాట తప్పాడు. విద్యుత్ చార్జీలు పెంచడమే కాకుండా అన్ని ధరలు కూడా పెరిగి ఆకాశాన్ని అంటుతున్నాయి. కూటమి పాలనలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

– షర్మిల, సిద్ధిక్‌నగర్, కానూరు

జగనన్న పాలనలో మేలు


విద్యుత్ చార్జీలు మోయలేని భారంగా ఉన్నాయి. ఒక్కసారే అంత విద్యుత్ చార్జీలు పెంచితే భరించేది ఎలాగో తెలియడం లేదు. ఒక్క పథకం కూడా అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు పెంచడం న్యాయం కాదు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి. జగనన్న పాలనలోనే విద్యుత్ చార్జీలు తక్కువగా ఉన్నాయి.

– ఎం.నాగలక్ష్మి, కానూరు

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత


ఉయ్యూరు: కార్యకర్తల కుటుంబాలకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ అన్నారు. అనారోగ్యంతో ఉయ్యూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 15వ వార్డు కౌన్సిలర్ కుమారుడు బ్రహ్మానాయక్‌ను శుక్రవారం ఆయన పరామర్శించారు. వైద్య ఖర్చులకు తన వంతు సాయంగా రూ. 10 వేలు అందించారు. ధైర్యంగా ఉండాలని, అన్ని వేళలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, పార్టీ నేతలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పి. శివాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి నడుపుతున్న బస్ సర్వీస్‌లకు సంబంధించి విలువైన సూచనలు, సలహాలు, సమస్యలను 87909 96090 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని డిపో పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సత్వర సేవలు అందించేందుకు చర్యలు


కంకిపాడు: రెవెన్యూ సేవలు సత్వరమే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ వి.భావనారాయణ తెలిపారు. మండలంలోని మద్దూరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సదస్సుల్లో అందిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారించి రెవెన్యూ సేవలు అందిస్తున్నామన్నారు. రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉస్మాన్, వీఆర్ఓ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

23 మందికి ఉద్యోగాలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన ప్లేస్మెంట్ డ్రైవ్‌లో 23 మంది బీటెక్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎస్.కిషోర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎక్స్ఎల్ఆర్ సంస్థ ప్రతినిధులు వివిధ స్థాయిల్లో పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కంపెనీ ప్రతినిధులు హెచ్ఆర్ మేనేజర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు అవగాహన సదస్సు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మామిడి సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల ఉద్యాన అధికారి ఇ.హరిచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపులపాడు మండలం కొత్త మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామిక వాడ సమీపంలోని సూక్ష్మగామ ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్‌లో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సదస్సుకు మామిడి పరిశోధనా కేంద్రం (నూజివీడు) శాస్త్రవేత్త డాక్టర్ కనక మహాలక్ష్మి, ఎంటమాలజిస్ట్ డాక్టర్ శాలి రాజు, మామిడి ఎగుమతిదారులు హాజరు కానున్నారని తెలిపారు. మామిడి రైతులు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు అడ్డుకుందాం

సీపీఎం పార్టీ మండల కార్యదర్శి

ఉంగుటూరు: స్మార్ట్ మీటర్లు అడ్డుకుందాం, విద్యుత్ సర్దుబాటు చార్జీలపై నిరసన తెలుపుదాం అని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఉంగుటూరులో పెంచిన విద్యుత్ చార్జీలు, స్మాట్ మీటర్లపై సీపీఎం కృష్ణా జిల్లా కమిటీ ముద్రించిన కరపత్రాలను శుక్రవారం ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచబోమని తగ్గిస్తామని ఎన్నికల్లో టీడీపీ కూటమి ఇచ్చిన హామీని విస్మరించిందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే పగులకొట్టండని కూటమి నేతలు ప్రతిపక్షంలో ఉండగా ప్రగల్బాలు పలికి.. విద్యుత్ ఒప్పందాలకు వ్యతిరేకంగా కేసులు వేసి ప్రజలను మోసం చేశారన్నారు. ఈ నెల నుంచి విద్యుత్ చార్జీలు పెంచడంతో పాటు పాత మీటర్లు తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా సీపీఎం ఉంగుటూరు మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగే పోరాటాల్లో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సీఎస్‌సీ ఇండియాతో ఎస్సార్కే ఒప్పందం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ (సీఎస్‌సీ ఇండియా)తో ఉపాధి నైపుణ్య శిక్షణ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎస్‌సీ ఇండియా సలహాదారు వై. రామ్మోహన్‌రావుతో ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు అవగాహన ఒప్పంద పత్రాలను పరస్పరం అందుకున్నారు. అనంతరం రామ్మోహన్‌రావు మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నేట్ ఆఫ్ థింగ్స్ సి–డాక్ ద్వారా విద్యార్థులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులకు ఎన్ఐఈఎల్ఐటీ 3డీ ప్రింటింగ్, రోబోటిక్ ప్రాసెసింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై ఉపాధి నైపుణ్యాలను, పారిశ్రామిక వ్యవస్థాపకత శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి శ్రీ గౌరి, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు, రామ్మోహన్‌రావు

మాజీ ప్రధాని మన్మోహన్‌కు ఘన నివాళి

ఉయ్యూరు: ఆర్థిక సంస్కరణల ప్రధాత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని పలువురు వక్తలు కొనియాడారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. ఎంపీడీఓ శేషగిరిరావు, ఏఓ లోయ శివశంకర్, అధికారులు పాల్గొన్నారు.

రేమల్లే జెడ్పీ హైస్కూల్‌లో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లేలోని జెడ్పీ హైస్కూల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కి శుక్రవారం ఘనంగా నివాళి అర్పించారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్థిక నిపుణుడిగా, ఆర్థిక శాఖ మంత్రిగా, ప్రధానిగా ఆయన దేశానికి అందించిన సేవలను ప్రధానోపాధ్యాయుడు ఎస్.లూథర్ పాల్ కొనియాడారు. పలు ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ పురోగాభివృద్ధికి బాటలు వేశారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు, సువర్చలాదేవి, కేవీ కుమారి, శ్రీలక్ష్మి, పార్థసారధి, వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఉయ్యూరులో మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శేషగిరిరావు

చినకంచిలో ఆరాధనోత్సవం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని చినకంచి దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి ఆరాధనోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కంచిపీఠానికి అనుబంధంగా ఉన్న నున్న గ్రామంలోని చినకంచి దేవస్థానంలో ఉదయం గణపతిపూజ, మహాన్యాసపూర్వక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చినకంచిలోని వేదపండితులు చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి ఆరాధన కార్యక్రమంలో పాల్గొని వేద సభ నిర్వహించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.


వేద సభలో వేదపండితులు

ఘనంగా సామూహిక కుంకుమార్చనలు

దావాజీగూడెం(గన్నవరం): మండలంలోని దావాజీగూడెంలో వేంచేసియున్న శ్రీసీతా రామ చంద్రస్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీగోదాదేవి సమేత శ్రీకృష్ణస్వామివార్లకు వివిధ రకాల పుష్పాలతో విశేష అర్చనలు జరిగాయి. తొలుత ఆలయ అర్చకుడు ఎన్. రామాచార్యులు నేతృత్వంలో భక్తులు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం నగర సంకీర్తన, తిరుప్పావై ప్రబంధ పారాయణం, భగవన్నామ సంకీర్తన జరిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ధనుర్మాస గోష్ఠి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

పెనమలూరు: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని టాటా మోటర్స్ ప్రధాన మానవ వనరుల అధికారి సీతారామ్ కండి అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో శుక్రవారం సాంకేతికత అవలోకనం అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. నాయకత్వ లక్షణాల గురించి వివరిస్తూ నాయకుడు ఎల్లప్పుడూ ఇవ్వడం నేర్చుకుంటాడని, ఇతరుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తాడన్నారు. నిజమైన నాయకుడు కావాలంటే నేర్చుకోవడం, చురుకుగా వ్యవహరించడం వంటి లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు టెక్నాలజీని ఉపయోగించుకోవడం కన్నా నూతన టెక్నాలజీ సృష్టించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీతారామ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రో వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, డైరెక్టర్ డాక్టర్ బావినేని పాండురంగారావు, ప్రొఫెసర్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సీతారామ్‌ను సన్మానిస్తున్న వైస్‌ఛాన్సలర్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ఉయ్యూరు: పట్టణంలోని గురజాడ డొంకరోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న తారురోడ్డు పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉయ్యూరు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో మరమ్మతులు చేస్తున్నామన్నారు. సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పరిశీలనలో వెంట్రప్రగడ వీరాంజనేయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంబేడ్కర్ కాలనీ షీయోను ప్రార్థన మందిరంలో శుక్రవారం ప్రార్థన మందిర నూతన సంవత్సరం క్యాలెండర్‌ను రెవరెండ్ డాక్టర్ వరప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మందిరం సంఘస్తులు విశ్వాసకులు పాల్గొన్నారు.

ఘనంగా కోస్టల్ బ్యాంకు రజతోత్సవ వేడుకలు

కంకిపాడు: కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. బ్యాంకు రజతోత్సవ వేడుకలు స్థానిక బ్రాంచి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాతాదారుల సమావేశం ఏర్పాటు చేశారు. నాబార్డు ఆర్గనైజేషన్ బైరెడ్ విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ కె.నాగప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ రషీదున్నీసా మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో అత్యుత్తమ సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు అందిస్తోందన్నారు. ప్రత్యేకమైన బ్యాంకింగ్ పరిష్కారాలు, డిజిటల్ మార్పులు, వినూత్న ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక బ్రాంచి ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్ శ్రీహరి, శిరీష, సుఖంతా, శేఖర్, సూర్య తదితరులు పాల్గొన్నారు.


ఖాతాదారుల సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ రషీదున్నీసా, సిబ్బంది